కవితా-చక్ర

# నివేదన





# 2

**ని**శ్శబ్దం నా చుట్టూ చీకటిలా పరచుకుంది.
నిన్ను ధ్యానిస్తూ నా కళ్ళు మూతలు పడ్డాయి!
మౌనంగా నన్ను తట్టి లేపిన నీ పిలుపు..
కళ్ళు తెరిచి చూశాను.
కనుచూపు మేర దాటుకుని వెళుతున్న నువ్వు!
దీనంగా నన్నావరించిన రోదన...!

# 8

**ను**వ్వు పంపిన సందేశాన్ని శ్రావణ మేఘం కొద్దిగా వంగి,
నా చెవిలో చెబుతూనే కరిగి...
నాపై కురిసింది!
అది విని...
నేను కార్చే అశ్రువుల తడి అంతర్లీనంగా నీ హృదయాన్నీ
తడిపే ఉంటుంది!
గుండెమాటు దాగిన విషాదంలోనూ నువ్వే!
అందుకేనేమో...
ఆనందంగా ఆస్వాదిస్తున్నాను!

# 16

**నీ** సేవకై ధూప, దీప, సుగంధాల్ని అమరుస్తున్నాను.
లీలగా వినిపిస్తోన్న సడి!
నా హృదయపీఠాన్ని అధిష్టించడానికి నీ పాదాలు దగ్గరవుతున్నాయి.
ఆనందోద్వేగంతో వెనుదిరిగాను.
నువ్వు రాలేదన్న సందేశాన్ని ఈడుస్తూ మోసుకొచ్చిన చిరుగాలి.
సుగంధ పరిమళాలు గాలిలో కలిసి నీ ఊపిరిని చేరనున్నాయి.
నా చేతులు నీ సేవకై అర్థిస్తూనే ఉన్నాయి..!

## 23

అలసట...!
దుఃఖానికి నిలయమై, విషాదానికి ఆలవాలమైన
ఈ బాధాతప్త హృదయం అలసిపోయింది.
నీ సన్నిధిలో భారాన్నంతా దింపి,
నీ చెంత నిశ్చింతగా సేద తీరాలన్న విన్నపం...
నీకు చేరే ఉంటుంది.
నీ పాదాలను అభిషేకించాలని
కన్నీటి కడవళ్ళు ఎదురుచూస్తున్నాయి.
నా ప్రార్థన ఆలకించి ఉన్నఫళంగా
నన్ను చేరాలని నువ్వూ సమాయత్తమయ్యావు.
అలుపెరగని నీ గమనంలో,
నేనొక మరపురాని మజిలీనని నీకూ తెలుసు...!

## 38

**స**మీపిస్తున్నాయి!
నువ్వు నన్ను అక్కున చేర్చుకునే...
అమృత క్షణాలు సమీపిస్తున్నాయి.
నీ సమక్షంలో 'నేను' కరిగిపోయే
అపురూప ఘడియలు చేరువవుతున్నాయి!
రెప్పవాల్చని ఎదురుచూపుల్లో అలసిన కళ్ళు
నీ యెద కోనలో సేద తీరే సమయం రానే వచ్చింది!
గుండె లయ తప్పి కొట్టుకుంటుంది
హృదయ స్పర్శే తప్ప...
దేహం ఎరుకని కోల్పోయింది.
తాళలేని బాధ నుండి...
విముక్తురాలిని చేసే తరుణం ఆసన్నమైంది!



# 42

ఆగని పయనంతో, చెరగని సంకల్పంతో..
నన్ను చేరుకోబోయే నీకేమివ్వనూ...!?
తళుక్కుమనే కాంతి తప్ప,
నీ ప్రేమకు కరగని పసిడి, వజ్ర వైడూర్యాలూ..
ఆడంబరాన్నే తప్ప, నిన్ను తాకి చలించలేని పీతాంబరాలూ...
నీకివ్వడానికివేవీ నా వద్ద లేవు!
భగవత్ప్రసాదమైన దేహపు దేవాలయాన హృదయపు గర్భగుడిలో
మిణుకు మిణుకు మంటూ వెలుగుతున్న
చిన్న ఆయువు దీపం తప్ప...
నీకేమివ్వగలనూ...!?

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nivedana+Kavitha+Chakra**

* * *